ఐక్యతతోనే సమ్మె సక్సెస్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు, ప్రజా సంఘాల ఐక్యతతోనే సార్వత్రిక సమ్మె సక్సెస్ అయిందని ప్రజా సంఘాల నేతలు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక వైఖరిని ఎండగట్టేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ఈ సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో గురువారం ప్రజా సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రహ్మణ్యం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాక్రిష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు హరికృష్ణ మాట్లాడుతూ ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బుద్ధి తెచ్చుకుని లేబర్‌కోడ్‌లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 8 గంటల పని దినాన్ని కొనసాగించాలన్నారు. కార్మికుల జోలికి వస్తే చంద్రబాబుకు మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో జయచంద్ర, మాధవ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

చదువే...జ్ఞానం..!



అట్టహాసంగా 'మెగా పేరెంట్ -టీచర్' మీటింగ్

వెంకటగిరిలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తింటున్న ఎంఎల్ఎ, కలెక్టర్

తిరుపతిలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తో విద్యార్థుల కరచాలనం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్, తిరుపతి టౌన్, యంత్రాంగం

'చదువే జ్ఞానం.. బట్టీ చదువులకు స్వస్తి పలికి, విద్యార్థులు ఆసక్తి చూపే రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహించాలి.. దురలవాట్లకు దూరంగా ఉండాలి..' అని వక్తలు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా మెగా పేరెంట్‌- టీచర్ మీటింగ్ ఆత్మీయ సమావేశాలతో అట్టహాసంగా జరిగింది. వెంకటగిరి ఎపి మోడల్ స్కూలులో ఎంఎల్ఎ కె.రామకృష్ణతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ జ్యోతి ప్రజ్వలనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఫొటోబూత్‌లో కలెక్టర్ ఫొటో దిగారు. ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. బోధనతీరు, తల్లికి వందనం ద్వారా లబ్ధిపొందిన తల్లులతో ముచ్చటించారు. విద్యార్థుల ప్రోగ్రస్‌పై ఆరా తీశారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో కలెక్టర్ ఒకవైపు, ఎంఎల్ఎ మరోవైపు నిలిచి పోటీలో పాల్గొన్నారు. తదుపరి తల్లులతో మ్యూజికల్ చైర్స్ పోటీ ప్రారంభించారు. ఎంఎల్ఎ కె.రామకృష్ణ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు పెడదోవ పట్టే అవకాశం ఉన్నందున మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా శ్రద్ధగా చదవాలన్నారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వినూత్నమైన ఆలోచనతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చారన్నారు. యువత ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర ప్లాట్‌ఫామ్‌ల్లో అత్యంత ఆసక్తి చూపిస్తూ, విలువైన సమయాన్ని కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు పాఠశాలల్లో భాగస్వాములై పిల్లల ఎదుగుదలలో,చదువుల్లో, ఆహారం విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. డొక్కాసీతమ్మ భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తనూజ, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ రామదాసు గంగాధర్, డిఇఒ కెవిఎన్ కుమార్, సర్వశిక్ష అభియాన్ సిఎంఒ సురేష్, ఎపిసి గౌరీశంకర్, ఎంఇఒ బాబయ్య పాల్గొన్నారు.

– **తిరుపతి టౌన్** కొర్లగుంటలోని శ్రీ సర్వేపల్లి రాధాక్రిష్ణ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో జరిగింది. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, కృషితో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు. హెడ్‌మాస్టర్ రవికుమార్, పాఠశాల ఛైర్మన్ వాణి, ఇన్‌ఛార్జి ఛైర్మన్ రహంతుల్లా పాల్గొన్నారు. రేణిగుంట అమరరాజా విద్యాలయంలో ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవప్రియ ఆధ్వర్యంలో జరిగింది. ఎంజిఎం హైస్కూల్లో ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం (ట్రెండ్స్) లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు తెలిపారు.

- **శ్రీకాళహస్తి** కాసాగార్డెన్ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో డిఎస్‌పి నరసింహమూర్తి పాల్గొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్లకు, సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. మున్సిపల్ కమిషనర్ సంజీవకుమార్, టుటౌన్ సిఐ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ జయశ్రీ పాల్గొన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సభ ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్మాయులు పి.కస్తూరయ్య అధ్యక్షతన జరిగింది. ఎంఇఒ బాబయ్య, నాగలాపురం సర్పంచి సుధా చిన్నదొరై, ఎస్ఎంసి కమిటి ఛైర్మన్ డి.అయ్యప్ప పాల్గొన్నారు.

– **రామచంద్రాపురం** మండలం కుప్పంబాదూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనుప్పల్లి జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల, మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో మాజీ ఎంపిపి డి.బిందుమాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యే విజ్ఞానాభివృద్ధికి నాంది అని పిలుపునిచ్చారు. పదిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు ఎం.తిరుమలరెడ్డి, మాజీ ఎంపిపి టి.కేశవులునాయుడు పాల్గొన్నారు. యర్రావారిపాలెం మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ ఆర్‌బి సరళ ఆధ్వర్యంలో జరిగింది. తహశీల్దార్ పరమేశ్వరస్వామి, ఎంపిడిఒ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

– **గూడూరు టౌన్** చెన్నూరు బాలుర పాఠశాలలో టిడిపి పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి పాల్గొన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ఉండాలని గుర్తింపు కార్డులను అందజేశారు. చివరి దశలో ఆగిపోయిన టాయిలెట్ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు టి.బాలనాగమ్మ పాల్గొన్నారు. సిఎస్ఎం జడ్‌పి హైస్కూల్లో ఎంఎల్ఎ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. వాకాడు ప్రభుత్వ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు పిడుగు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో తహశీల్దార్ రామయ్య, ఎంపిడిఒ శ్రీనివాసులు పాల్గొని విద్యపై అవగాహన కల్పించారు. వల్లమేడు స్కూలుకు ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తిపలపూడి రమణయ్య పాఠశాల అభివృద్ధికి రూ.5వేలు విరాళంగా అందజేశారు.

– **పుత్తూరు టౌన్‌లో** మెయిన్ స్కూల్‌కమిటి ఛైర్మన్ టి.దొరవేల్, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. పుస్తకాల బ్యాగ్ బరువు తగ్గించేందుకు సెమిష్టర్ విధానం తీసుకొచ్చామన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. డివైఇఒ మహేశ్వరరావు, ఎంఇఒ తిరుమలరాజు పాల్గొన్నారు పరమేశ్వర మంగళం జిల్లా పరిషత్ స్కూల్లో ప్రధానోపాధ్యాకయులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభకు చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

– **దొరవారిసత్రం** మావిళ్లపాడు మోడల్ స్కూల్లో నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సుమలత ఆధ్వర్యంలో జరిగింది.

బలవంతపు బడుల విలీనం ఆపాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు మండల పరిధిలోని నెర్నూరు ఎస్సీ, ఎస్టీకాలనీలలో పిల్లలకు చదువును దూరం చేయొద్దు' అంటూ కెవిపిఎస్, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'బలవంతపు పాఠశాలల విలీనం ఆపాలి' అంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రమాదకరమైన ప్రాంతాల్లో విద్యార్థుల భవిష్యత్, భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని, విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. తిరుపతి జిల్లాలో మొత్తం 580 ప్రాథమిక పాఠశాలలను విలీనం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపాల ప్రసాద్, జోగి శివకుమార్, బివి రమణయ్య, నాగభూషణం, దర్శి, పుట్టా శంకరయ్య, రమేష్, ఏంభేటి చంద్రయ్య, బి.చంద్రయ్య, ఆర్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

నెర్నూరు విద్యార్థుల నిరసన

మన బడిని కాపాడుకుందాం

ప్రజాశక్తి -రేణిగుంట

పలు ప్రభుత్వ స్కూళ్లల్లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సంబరాల్లో పాల్గొన్నారు.ఆటపాటల తరువాత ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం అవసరం అని, మెర్జింగ్ వల్ల ఒక్క విద్యార్థి కూడా నిలిచిపోకూడదని అన్నారు. పునరాలోచన చేసి మెర్జింగ్ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావికాస వేదిక నాయకులు ఓ.వెంకటరమణ,కుప్పస్వామి, ఇమామ్, కిషోర్, ఎంపిటిసి రాజేశ్వరి, దీప, రాజశేఖర్, జబ్బార్, డాక్టర్ జనార్ధన్ పాల్గొన్నారు.

'మెగా' మీటింగ్‌కు ప్రైవేట్ స్కూళ్లు దూరం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్‌- టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించింది. ప్రైవేట్ స్కూళ్లు సైతం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చింది. అయితే జిల్లాలో చాలాచోట్ల ప్రైవేట్ స్కూళ్లలో ఈ ఈ కార్యక్రమం జరగకపోవడం గమనార్హం. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎస్ కుమార్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా మీటింగ్ జరపని ప్రైవేట్ స్కూళ్లకు నోటీసులు పంపి వివరణ తీసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

దేవుని ఊరేగింపులో దళితులపై వివక్ష

కెవిపిఎస్, పోలీసుల జోక్యంతో అందరితో పూజలు

ప్రజాశక్తి-తొట్టంబేడు

స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా నేటికీ దళితులు వివక్షకు గురవుతూనే ఉన్నారు. గ్రామాల్లో వేళ్లూనుకుని ఉన్న వివక్ష ముఖ్యంగా దేవుని ఊరేగింపుల్లో, జాతరల్లో వెలుగులోకి వస్తుంది. తొట్టంబేడు మండలం కాసరం పంచాయతీ రాంబట్లపల్లి గ్రామంలో సాయిబాబా దేవాలయాన్ని నిర్మించుకుని ఊరేగించే సందర్భంగా మరోసారి దళితుల పట్ల వివక్ష బట్టబయలయ్యింది. కెవిపిఎస్ చొరవతో డిఎస్‌పి చర్చలతో తాత్కాలికంగా వివక్షకు తెరపడింది. అందరూ కలిసి సాయిబాబాకు పూజలు చేసుకోవడంతో కథ సుఖాంతమయ్యింది. వివరాలిలా ఉన్నాయి.

తొట్టంబేడు మండలం కాసరం పంచాయతీ రాంబట్లపల్లి గ్రామంలో గతంలో గ్రామంలో ఉన్న చెరువు కట్టమీద అందరూ కలిసి చందాలు వేసుకుని సాయిబాబా దేవాలయాన్ని నిర్మించుకున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించి సాయంత్రం సమయంలో ట్రాక్టర్ సహాయంతో సాయిబాబా పెద్ద చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి బాగా అలంకరించి ఆ గ్రామం మొత్తం ఊరేగించటం సాంప్రదాయం. ఆ సమయంలో గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ పూజ సామాగ్రితో వచ్చి స్వామివారి మొక్కులు తీర్చుకునేవారు. మొదటి సంవత్సరం ఊరేగింపు మాత్రం ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగింది. రెండవ సంవత్సరం ఊరేగింపును నిర్వాహకులు ఊరిలో మాత్రమే ఊరేగింపును తిప్పి తిరిగి ఆలయం వద్దకు చేరుకున్నట్లు దళితులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం జరిగిన విధంగా ఈ సంవత్సరం కూడా ఎక్కడ జరుగుతుందో అని కలవరపడిన దళితులు ముందుగానే కొంతమంది గ్రామ పెద్దలతో ఈ విషయం మీద మాట్లాడితే ఈ సంవత్సరం కూడా ఊరేగింపు గ్రామంలోనే తిరుగుతుందని దళితవాడలోకి రాదని స్పష్టం చేశారు.

దీంతో ఏమి చేయాలో అర్థం కాని రాంబట్లపల్లి దళితులు ఈ సమస్యను కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కె.వి.పి.ఎస్ నాయకులు అంగేరి పుల్లయ్య, సురేష్, గంధం మణి, గురవయ్య, వెంకటేష్, గురునాథం దళితులను వెంటబెట్టుకుని శ్రీకాళహస్తి డీఎస్‌పి నర్సింమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డిఎస్‌పి ఎటువంటి వివక్ష లేకుండా ఊరేగింపు గ్రామమంతా జరపాలని సూచించారు. తొట్టంబేడు పోలీసు శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. వివక్ష పాటిస్తే కెవిపిఎస్ ఆధ్వర్యంలో పోరాడతామని నాయకులు సురేష్ హెచ్చరించారు. సిఐ తిమ్మయ్య స్పందిస్తూ గ్రామంలో ఎటువంటి సంఘర్షణలకూ తావులేకుండా ప్రతి ఒక్కరూ దేవాలయం వద్దకు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు.

కులవివక్ష అంశంపై మాట్లాడేందుకు డిఎస్‌పి కార్యాలయానికి విచ్చేసిన కెవిపిఎస్ నాయకులు

సెప్టెంబర్ 24 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి నిర్దేశిత సమయంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 23న అంకురార్పణ, 24న ధ్వజారోహణం, 28న గరుడ వాహనం, అక్టోబర్ 1న రథోత్సవం, 2న చక్రస్నానం ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయి. బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వృద్ధులు, దివ్యాంగుల, దాతల దర్శనాలూ రద్దు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్‌మ్యాప్‌లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 27–29 తేదీల్లో తిరుమల ఘాట్ రోడ్డుల్లో ద్విచక్రవాహనాలకు అనుమతి నిరాకరణ. భక్తుల రద్దీకి తగిన విధంగా లడ్డూలను నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు.

డీఎఫ్ఒ ఫణి కుమార్ నాయుడు, ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, టీటీడీ ఆల్ ప్రాజెక్ట్స్ ఆఫీసర్ రాజగోపాల్, ఈఈలు సుబ్రహ్మణ్యం, వేణు గోపాల్, డిఈ చంద్ర శేఖర్, అశ్వినీ ఆసుపత్రి సివిల్ సర్జన్ కుసుమ కుమారి, ఎస్వీబీసీ ఓఎస్డీ పద్మావతి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జీ.ఎల్.ఎన్. శాస్త్రి పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ ప్లాంట్లు పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నిర్వహణ ప్లాంట్లను కేంద్ర గహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ బందం గురువారం ఉదయం పరిశీలించారు. గురువారం ఉదయం కేంద్ర కార్యదర్శి తో పాటు సంయుక్త కార్యదర్శి (అమత్ పథకం) ఇషా కాలియా, సాంకేతిక సలహాదారుడు రోహిత్ కక్కర్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నగరపాలక సంస్థ అధికారులతో కలసి తూకివాకం , రామాపురం చెత్త నిర్వహణ ప్లాంట్లను పరిశీలించారు. తిరుపతి నుండి తూకివాకం వరకు మురుగునీరు సరఫరా అయ్యే భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ రేణిగుంట మార్గంలో కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం తూకివాకం వద్ద గల మురుగునీటి శుద్ధి కేంద్రం, తడి, పొడి చెత్త, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను పరిశీలించారు. మురుగునీరు శు ద్ధి చేసి ప్రైవేట్ ఫ్యాక్టరీ లకు, పంటలకు సరఫరా చేస్తున్నామని కమిషనర్ వివరించారు. అలాగే తడి చెత్త తో ఎరువు, గ్యాస్ తయారు చేయడం, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ను వివరించారు. అనంతరం రామాపురం వద్ద గల బయో మైనింగ్ ప్లాంట్ ను పరిశీలించారు. ఇక్కడ చెత్త నిర్వహణ చేయగా వచ్చిన ఎరువును పొలాలకు, ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నివారణ పట్ల కేంద్ర బందం సంతప్తి వ్యక్తం చేసి, అభినందించారు. కేంద్ర బందం వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి ఉన్నారు.

మహిళా సాధికారతకు ఉపాధి శిక్షణ

ఏపీ రూసా ప్రాజెక్టు డైరెక్టర్ భరత్ గుప్తా

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించేందుకు మహిళలకు సరైన ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అత్యవసరమని ఏపీ రూసా ప్రాజెక్టు డైరెక్టర్ భరత్ నారాయణ గుప్తా పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సావేరి అతిథి గహంలో వివిధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లు వర్సిటీ వివిధ విభాగాల అధ్యక్షులు, అధ్యాపకులతో " జెండర్ ఇంక్లూజివ్ ఎంపవర్మెంట్ ఇనిషియేటివ్ ' అంశంపైన వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య రూస ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ భరత్ నారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బాలికల విద్యను పెంపొందించేందుకు, మహిళలకు ఉపాధి కల్పించేందుకు, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మహిళల కోసం సరైన ప్రణాళిక రూపొందించి దాని ద్వారా ఉత్తమ ఫలితాలు తీసుకురావడం ఈ రూసా ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ముఖ్య అధితిగా ఎపి ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ రామమోహన్ రావు మాట్లాడుతూ పీఎం ఉష స్కీం ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని యూనివర్సిటీస్‌కి ఫండింగ్ రావటం, దానిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విసి వి.ఉమ మాట్లాడుతూ నిధుల కొరత ఉన్న ఈ సమయంలో పీఎం ఉష ద్వారా 100 కోట్లు మహిళా యూనివర్సిటీకి రావడం చాలా సంతోషం, బాధ్యతను ఇంకా పెంచింది అన్నారు. ఇన్స్టిట్యూషనల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా చుట్టుపక్కల ఉన్నటువంటి మహిళలకు వారి అవసరాలకు తగిన విధంగా ట్రైనింగ్ ఇవ్వడం, వారి పురోగతికి దోహదపడటం చాలా ముఖ్యమని అన్నారు. సిఎండి, ఏఎస్ఏపి, కేరళ డాక్టర్ ఉష మాట్లాడుతూ కేరళలో అవలంబించిన మహిళా సాధికారత ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ తులసి, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు తక్షణమే చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్స్ చేపట్టలేదనీ, వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలను గురువారం భగత్ రవి సందర్శించారు. గత ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరిట నాలుగేళ్ల డిగ్రీని ప్రవేశపెట్టిందన్నారు. మేజర్, మైనర్ సబ్జెక్టులంటూ విద్యార్థులను గందరగోళానికి గురి చేసిందని మండిపడ్డారు. ఇంటర్న్షిప్ లంటూ పరిశ్రమల్లో, కంపెనీల్లో లేబర్లుగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వానికేమీ తీసిపోనట్లు విద్యా విప్లవం పేరిట అదే విధానాలను కొనసాగిస్తోందని విమర్శించారు. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాకుంటే విద్యార్థులు చేరిక చాలా తగ్గి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డబుల్ మేజర్ కోర్సులను కొనసాగించాలనీ, ఇంటర్న్షిప్ తీసివేయాలనీ, ఆఫ్ లైన్ లో అడ్మిషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో దాగివున్న సజనాత్మకతను వెలికి తీసే వత్తి నైపుణ్యతా కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. డేవిడ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 4 నుంచి స్కిట్ లో అడ్మిషన్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 4వ తేదీ నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్కిట్ కళాశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. స్కిట్ కు సంబంధించిన రూ. 120 కోట్ల ఆర్థిక లావాదేవీల పైన ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ వచ్చిందని తెలిపారు. త్వరలోనే జీవో విడుదల కానుందని చెప్పారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కొర్లగుంటలోని సమర్థ సద్గురు శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో గరు పౌర్ణమి పురస్కరించుకొని ఉదయం నుంచి ధర్మకర్త జవ్వాజి శాంబశివయ్య ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష హాజరై శిరిడి సాయిబాబా పూజా కార్యక్రమంలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం శ్రీ పద్మావతి వద్ధాశ్రయానికి ,గుడి నిర్వహకులు మహిళలకు శారీ,బ్లౌజులు, పురుషులకు పంచ టవల్స్, అదేవిధంగా ఏర్పేడు లోని యస్ఓయస్ పాఠశాలకు, రామచంద్రపురం మండలం బొప్పరాసిపల్లెలోని పాఠశాలకు, చంద్రగిరి మండలం పనపాకం లోని పాఠశాలకు బుక్స్ పలకలు, బలపంలను మేయర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గుడి ధర్మకర్త జవ్వాది సాంబశివయ్య సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని అందులో భాగంగా వద్ధాశ్రయానికి బట్టలు బియ్యం పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. పూజ కార్యక్రమంలో రాష్ట్రయాదవ కార్పొరేషన్, ఛైర్మన్ గొల్ల నరసింహయాదవ్ పాల్గొన్నారు. జవ్వాజి గంగాధరం, పానేటి చెంగల్రాయులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి గంగమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శెట్టిపల్లి నడివీధి గంగమ్మ తల్లిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఎన్డీఏ నాయకులు రామకృష్ణ, బాలమురళీ కృష్ణ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు స్వాగతం పలికి దర్శనం చేయించారు. రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. మూడేళ్ళకు ఒకసారి జరిగే జాతరలో ప్రజలంతా భాగస్వాములు కావడం సంతోషకరమని ఆయన తెలిపారు. జాతర తెలుగుప్రజల జీవన విధానంలో ఒక భాగమని ఆయన చెబుతూ నేటికి ఆ సాంప్రదాయాలను పాటించడం గొప్ప విషయమని చెప్పారు. మంగళవారం ప్రారంభమైన జాతర శుక్రవారంతో ముగియనుంది. శుక్రవారం మూలస్థానమ్మ రూపంలో ప్రజలకు దర్శనం ఇవ్వనుంది.

తిరుమలలో వైభవంగా గురు పౌర్ణమి గరుడ సేవ

ప్రజాశక్తి - తిరుమల

గురు పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

బిఎల్ఓలకు అవగాహన

ప్రజాశక్తి - వాకాడు: మండలంలోని స్త్రీ శక్తి భవనంలో తహశీల్దార్ రామయ్య ఆధ్వర్యంలో గురువారం బిఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సక్రమంగా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత బిఎల్ఓ లదేనన్నారు. అర్హులైన వారికి ఓటు హక్కును కల్పించి ఓటు వేసేలా చూడాలన్నారు.

వైసీపీ నుండి టీడీపీలోకి..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం, బత్తిలంద్రిగ పంచాయతీకి చెందిన వారు వైసిపి నుంచి టీడీపీ లోకి గురువారం చేరారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, అల్లం రాజేష్, అల్లం చంద్రశేఖర్, అల్లం పద్దినంతటీడీపీలోకి ఆహ్వానించారు. కాగా వారు ప్రభుత్వ పాలనా తీరుకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.

మధుసూదన్ రెడ్డి కర్మక్రియల్లో రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలం, పైడిపల్లికి చెందిన వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు కావేటి పెద్ద కుమారుడు, మధుసూదన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం జరిగిన ఆయన కర్మక్రియల్లో కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజాహితమే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం : ప్రజాహితమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని టిడిపి యూనిట్ కో ఇన్చార్జ్ బండి విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అనుపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో గ్రామాలలో సీసీ రోడ్లు, మురికినీటి కాలువలు, గోకులం షెడ్లు, రైతులకు రాయితీ ఆధునిక వ్యవసాయ పనిముట్లు, వేరుశనగ విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిందు మాధవి, మునిరత్నం నాయుడు, జయప్రకాష్ యాదవ్, రఘురెడ్డి, అశా దేవరాజులు, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చిట్టిబాబు, యారం జవహర్ రాయల్, పి జగదీష్ బత్తల సురేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఓజిలి: ఓజిలి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా శ్రీకాంత్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామన్నారు. గతంలో ఓజిలి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన ఎస్ఐ స్నేహ బదిలీపై శ్రీహరికోటకు వెళ్లగా ఆమె స్థానంలో శ్రీకాంత్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు నూతన ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గూడూరులో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ రాష్ట్ర వ్యాప్తంగా జూలై 8 నుండి 12 తేది వరకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా, గూడూరు రెండో పట్టణ పోలీసులు తనిఖీలు చేపట్టారు. సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఎస్సై గోపాల్ నేతృత్వంలో ప్రత్యేక తనిఖీ టీమ్ ఏర్పాటు చేశారు. ఈ టీంలో ఒక్కరు మహిళా ఏఎస్సైలు, ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ ను నియమించారు. ఈసందర్భంగా గురువారం గూడూరు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రైవేట్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులు, బడ్డీ కొట్టు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో తనిఖీలు చేశారు. పొగాకు ఉత్పత్తుల విక్రయం విషయంలో జరిమానా వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుత ర్యాలీకి తరలిరండి

ప్రజాశక్తి-వెంకటగిరి: 22న వెంకటగిరిలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రైస్తవ మైనారిటీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ క్రైస్తవ మైనారిటీ రాష్ట్ర వై.ఎస్.చైర్మన్ కనపర్తి సాలోమోనురాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈర్యాలీ ముస్లిం, క్రైస్తవ మైనారిటీ ప్రజలు పాల్గొని మతోన్మాద బిజెపి వ్యతిరేక నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం పేతురు లూధర సంఘం చర్చిలో సభ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈకార్యక్రమాన్ని బిజెపి వ్యతిరేక శక్తులందరూ ఐక్యంగా నిలబడి తమ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : సేఫ్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా దొరవారిసత్రం మండల పరిధి, పూలతోట గ్రామంలోని దుకాణాల సముదాయాన్ని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణదారులను వ్యాపారాల ముసుగులో, మాదకద్రవ్యాలు అమ్మకాలు చేయకూడదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ అజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల దురుసు ప్రవర్తన హేయం

ప్రజాశక్తి - క్యాంపస్ : చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల పరామర్శ కోసం బంగారుపాళ్యంకు వచ్చిన వైఎస్ జగన్ రెడ్డి కార్యక్రమానికి విచ్చేసిన అభిమాని శశిధర్ ను పోలీసులు గాయపరచడం దారుణమని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరి ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, జగన్ అభిమానులపై దాడి చేయడం దారుణమన్నారు. శశిధర్ తలపై గాయాలయ్యాయని, వైసిపి పబ్లిసిటీ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి ఆయనను పరామర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ వీరేంద్ర వర్మ, డిస్ట్రిక్ట్ భాగం రాష్ట్ర కార్యదర్శి పోతు మురళీధర్, యూత్ వింగ్ రీజనల్ ప్రెసిడెంట్ హేమంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అలిపిరి గరుడ విగ్రహం వద్ద గురువారం గురు పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ ప్రచార భజన కళాకారుల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జానపద వృత్తి కళాకారులు ప్రతి పౌర్ణమికి అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం తదితరులు పాల్గొన్నారు.

'ది 100' చిత్రాన్ని ఆదరించండి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): మొగలి రేకులు సీరియల్ కథానాయకుడు ఆర్కే నాయుడు హీరోగా చేసిన ది 100 చిత్రాన్ని ఆదరించి విజయ వంతం చేయాలని జనసేన పార్టీ నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమా వేశంలో సినిమా పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం ఆర్కాట్ మాట్లా డుతూ కుటుంబంతో చూడదగ్గ సినిమా ది 100 అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు వేణుగోపాల్ రావు, శ్యాంసోలొమన్ హరినాథ్, వెంక టేశ్వర్లు, రఘు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - ఏర్పేడు: మండలంలోని మునిపేటలో పామాయిల్ తోటల పెంపకంలో భాగంగా ఉద్యాన శాఖ అధికారి ప్రవృతల ఆధ్వర్యంలో 3 ఎఫ్ ఆయిల్ పామ్ అధికారుల సమక్షంలో కొత్తగా సాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. అంతరపంటలు పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు.

మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఎక్స్‌పోలో మెరిసిన శ్రీసిటీ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శ్రీసిటీ, జపాన్‌లోని టోక్యోలో జరిగిన మ్యానుఫ్యాక్చరింగ్ వరల్డ్–2025 లో పాల్గొని, ప్రపంచ స్థాయిలో ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా తన ప్రాధాన్యతను చాటుకుంది. 9 నుండి 11వ తేదీ వరకు జరుగుతున్న ఆసియాలోనే అతిపెద్ద తయారీ వాణిజ్య ప్రదర్శనలో 75,000 కంటే ఎక్కువ మంది పరిశ్రమ నిపుణులు పాల్గొంటారని అంచనా. జపాన్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్ (37వ ఎడిషన్) లో ఐటీ సొల్యూషన్స్, మెకానికల్ కాంపోనెంట్స్, మెడికల్ డివైసెస్, సంకలిత తయారీ, సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ మెయింటెనెన్స్ తదితర విభాగాల పది ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తయారీ రంగానికి ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా శ్రీసిటీ ఖ్యాతిని బలోపేతం చేస్తూ వివరణాత్మకంగా తయారు చేసిన మార్కెటింగ్ వీడియోలను శ్రీసిటీ మార్కెటింగ్ బృందం ఇందులో ప్రదర్శించింది. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా, పలు ప్రత్యేకతలను హైలైట్ చేస్తూ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, పరిశ్రమలు స్థాపించడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు గోపి కృష్ణ, బాలాజీ, జపాన్ మాజీ రాయబారి శ్రీసిటీ సలహాదారు మసనోరి నకానో సందర్శకులకు వివరించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దీనిపై స్పందిస్తూ, ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు, ముఖ్యంగా తమ జపనీస్ భాగస్వాములకు శ్రీసిటీ ప్రత్యేక బలాలు, పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించడానికి ఈ ఈవెంట్ అత్యంత విలువైన వేదికగా ఆయన అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ తయారీ గమ్యస్థానాన్ని నిర్మించాలనే తమ నిబద్ధతను ఇది బలోపేతం చేస్తుందన్నారు. శ్రీసిటీ ఈ ఎక్స్‌పోలో పాల్గొనడం ద్వారా ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి, భారతదేశ తయారీ రంగ అభివృద్ధికి దోహదపడడంలో తమ నిరంతర కృషిని స్పష్టం చేస్తుందన్నారు.

సంక్షేమ పథకాలు సమానంగా వర్తింప చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, మున్సిపల్ కార్మికులు రాష్ట్ర జిల్లా కమిటీల పిలుపు మేరకు గురువారం మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం వర్తింప చేయాలని, కోరుతూ ఏ.పీ. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, ఇంజనీరింగ్ కార్మికులకు 36వ జి.ఓ.ని వర్తింపజేయాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని మొదలైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం గూడూరు పట్టణ కార్యదర్శి దార కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎన్.వెంకట రమణయ్య, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు నాయకులు బి.వి రమణయ్య, పామంజి మణి, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, చంద్రమోహన్, జి.శ్రీనివాసులు, పెంచలమ్మ, జి.కృష్ణమ్మ, వెంకటయ్య, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బలప్రదర్శన కోసమే జగన్ పర్యటన : నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను చేస్తున్న పర్యటనలు ప్రజల ముందు చేసే బల ప్రదర్శనలుగానే ఉన్నాయని, దీంతోపాటుగా ఆయా ప్రాంతాలలో శాంతిభద్రతల సమస్య సృష్టించడానికే ఆయన పర్యటనలు సాగుతున్నాయని యాదవ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎక్కడ నష్టపోకూడదని ముఖ్యమంత్రి ఎంతో దూరదృష్టతో ఆలోచించి ఈసారి పెరిగిన తోతాపూరి మామిడి రకానికి సంబంధించి రైతును ఎలాగైనా ఆదుకోవాలని గుజ్జు పరిశ్రమలతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వం నుండి సబ్సిడీ రూపంలో రైతును ఆదుకుంటుంటే దాన్ని చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తనకు అనుమతి ఇచ్చిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులను బంగారుపాళ్యం కు రప్పించి అలజడి సృష్టించి శాంతి భద్రతల సమస్య సృష్టించారన్నారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని జగన్‌కు సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, కరాటే చంద్ర, సుబ్బు యాదవ్, హరి, రామారావు పాల్గొన్నారు.

కొర్లగుంట పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ డే

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కొర్లగుంట మున్సిపల్ పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి మధు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సామర్థ్యం మెరుగుపరచడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. జనసేనపార్టీ మహిళా ప్రతినిధి ఆకే పార్టీ సుభాషిణి మట్లడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపకురాలు తహసున్నీసా బేగం మాట్లాడుతూ తల్లితండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోఎంధ్యాయులు ఖాదర్ బాషా, మహ్మద్ జునైద్, టాటా కాన్సర్ ట్రస్ట్ ప్రోగ్రామ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని పంగూరు, ఏర్పేడు, బండారుపల్లి, పాపా నాయుడు పేట, మునగల పాలెం, పల్లాం జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు సీఆర్పీలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో..

ప్రజాశక్తి -ఏర్పేడు : తల్లికి వందనం, ఉచిత నోట్స్ లు, టెక్స్ట్ బుక్కులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం వంటి పథకాలను ఇంటర్ చదివే పేద విద్యార్థులు ఉపయోగించుకుని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు పిలుపునిచ్చారు. పాపా నాయుడు పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో " పేరెంట్స్ టీచర్స్ మీటింగ్" కార్యక్రమం లో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధి పనులకు సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఎంపీటీసీ మునిరాజు, కృష్ణప్ప మొదలియార్, నాయకులు అర్జున్ బాబుత తదితరులు పాల్గొన్నారు.

'కౌటిల్య'లో పట్టాభిరామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఎంఆర్ పల్లి సర్కిల్ వద్ద ఉన్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్‌లో గురువారం ప్రముఖ సైకాలజిస్ట్, మెజీషియన్ డాక్టర్ బివి పటాభిరామ్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైకాలజిస్ట్ డాక్టర్.ఎన్.బి సుధాకరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టాభిరామ్ రాసిన పుస్తకాలు బహుమతిగా ఇచ్చారు. అనంతరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో కౌన్సెలింగ్, మనో వికాసానికి విలువ పెంచిన పట్టాభిరామ్ చిరస్మరణీయుడని కొనియాడారు. తెలివితేటల కంటే వ్యక్తిత్వం, దృక్పథం ప్రధానమన్న విషయాన్ని ఆయన లోకానికి తెలిపారన్నారు. కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ నేడు ఎంతో మంది పట్టాభిరామ్ శిష్యులే గొప్ప శిక్షకులుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ విద్యలో ఆన్‌లైన్ కోర్సులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ :పీజీ విద్యలో ఆన్లైన్ విద్యా విధానాన్ని రద్దు చేయాలని యస్వీయు ఇంచార్జీ విసికి ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ఓ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్, పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశలు మాట్లాడుతూ యస్వీయులో ఫీజులు పెంచడం, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ సరిగా అందకపోవడంతో కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్ లైన్ పీజీ కోర్సులతో విద్యార్థులకు ఆర్థిక భారం మరింత పెరుగుతుందని తెలిపారు. వర్శిటీలో బోధకుల కొరత, ల్యాబ్ సౌకర్యాలు కూడా సరిగా లేవని విమర్శించారు. ఆన్లైన్ కోర్సుల పేరుతో ఎడెక్స్ కంపెనీతో 50 కోట్లకు ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. పేద విద్యార్థుల్ని ఉన్నత విద్యకు దూరం చేస్తున్న ఆన్లైన్ కోర్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసయ్య, గీత, పిడిఎస్ఓ నాయకులు స్రవంతి, దేవేంద్ర, పీజీ విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత సంస్కృత బోధన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గత ఏడు సంవత్సరాలుగా చిన్నారులకు సంస్కృత భాషను ఉచితంగా బోధించే బాల కేంద్రాలను నడుపుతున్నారు. ఈ సంవత్సరం కూడా అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 5 సంవత్సరం నుండి 15 సంవత్సరాల లోపల వయస్సు కలిగిన పిల్లలు శని ఆదివారాలలో సాయంత్రం 5.30 గంటల నుండి 7.00వరకు జరిగే ఈ తరగతులలో పాల్గొనవచ్చు. ఈ తరగతులు పూర్తిగా ఉచితం. ఈ సదుపాయాన్ని తిరుపతి నగర ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరుతున్నారు. శని ఆదివారాలలో సాయంత్రం 5.30 గంటలకు విశ్వవిద్యాలయంలోని శ్రీ చెలికాని అన్నారావు భవనంలో ఉన్న సంస్కృత సంవర్ధన కేంద్రంలో దరఖాస్తు పత్రాలను నింపి పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలి. పిల్లల ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ అవసరం అని చెప్పారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా సంస్కృత సంవర్ధన కేంద్ర డైరెక్టర్ డా. సోమాశి సీతారామశర్మ పత్రికాప్రకటనద్వారా తెలియపరచుచున్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 8367476975, 9441316319 సంప్రదించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో గురుపూర్ణిమ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి ఆధ్వర్యంలో గురుపూర్ణిమ ఉత్సవం వైభవగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురు స్థానం ఉత్తమమైందని తెలిపారు. వ్యాస మహర్షి జన్మదినాన్ని గురు పౌర్ణమిగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ పూజారి, వెంకటేశన్, డాక్టర్ మన్యం నరసింహులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంత్ కబీర్ అవార్డుకు లక్కా శ్రీనివాసులు ఎంపిక

లక్కా శ్రీనివాసులును సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ప్రజాశక్తి - వెంకటగిరి : చేనేత కళాకారుడు, డిజైనర్ లక్కా శ్రీనివాసులు జిల్లాకు వరంగా మారారని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో చేనేత కళాకారుడు, డిజైనర్ లక్కా శ్రీనివాసులు నేసిన చీరలను స్థానిక ఎమ్మెల్యే తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డ్ టెక్స్టైల్, హ్యాండ్లూమ్స్ రంగంలో అత్యున్నత పురస్కారమని, ఈ ప్రాంత వాసులకి ఇప్పటివరకు ముగ్గురికి మాత్రమేరావడం జరిగిందని, దేశ వ్యాప్తంగా ఇద్దరికీ ఇస్తే అందులో మన రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా, వెంకటగిరి నియోజకవర్గం నుంచి చేనేత కళాకారుడు, డిజైనర్ లక్కా శ్రీనివాసులు సంత్ కబీర్ అవార్డుకు ఎంపికయ్యారన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి సత్కరించారు. స్థానిక ఎం.ఎల్. ఏ కె. రామకృష్ణ మాట్లాడుతూ, ఆయన భవిష్యత్తు లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ల పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రానున్న ఐదేళ్లలో తిరుపతి నగర పరిధిని విస్తరింప చేయాలన్న లక్ష్యంతో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో తుడా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలియజేశారు. తుడా అభివృద్ధిపై స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాలయం ప్రొఫెసర్లు గురువారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుడా అధికారులు తుడా పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులను, అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. తాము తుడాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యి తుడా అభివృద్ధికి సహకారం అందజేస్తామన్నారు. అనంతరం శెట్టిపల్లి భూములను తుడా అధికారులతో కలిసి పరిశీలించారు. టీటీడీతో కలసి తిరుపతిని, శ్రీకాళహస్తి దేవస్థానంతో కలిసి శ్రీకాళహస్తిని అభివృద్ధి చేస్తామని దివాకర్ రెడ్డి తెలిపారు. అందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ రోడ్లను వేస్తున్నామన్నారు.

గ్రామాభివృద్ధే టీడీపీ లక్ష్యం

ప్రజాశక్తి - తొట్టంబేడు : గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడమే సీఎం ప్రధాన లక్ష్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కారాకొల్లు, కంచనపల్లి గ్రామాలలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి చలపతి నాయుడు, బాలాజీ రెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు 'మై టిడిపి యాప్'లో నమోదు

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని నాగంపల్లిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా గురువారం ఇంటింటికి వెళ్లి సంవత్సరం రోజుల కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ కరపత్రాలను నాయకులతో కలిసి పంపిణీ చేయడం జరిగింది. ఏమైనా సమస్యలు ఉన్న మై టిడిపి యాప్‌లో పొందుపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్డి వారి గురువారెడ్డి, మైనారు పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పిఏలు రద్దుచేసి కమీషన్లు దండుకున్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బిజెపి ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో చేసింది ఏదైనా ఉంది అంటే అది నాన్ పెర్ఫార్మెన్స్ అసెట్స్ (ఎన్ పిఏ)రూ.14.50 లక్షల కోట్ల రూపా యలను రద్దుచేసి 10 శాతం కమీషన్లు దండుకోవడమేనని మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ రైతుకు నష్టం వచ్చి రుణమాఫీ చెయ్యమంటే ఎన్నో నిబంధనలు చెప్పే బ్యాంకర్లు, ఓ వ్యక్తికి వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలంటే పేరాలకు పేరాలు నిబంధనలపై సంతకాలు చేసుకునే బ్యాంకర్లు వ్యాపారాలు చేసుకుంటున్నామని, వ్యాపార అభివృద్ధికి రుణాలు కావాలంటూ కోట్ల రూపాయలు తీసుకొని బ్యాంకర్లకు తిరిగి చెల్లించకుండా దేశం దాటిపోయిన వారికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాసోహమయి, ఆ రుణాలను రద్దు చేసిందన్నారు. ఎన్ పిఏ రద్దు వెనుక లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను దేశ ప్రజల ముందు నిలబెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జగన్ పర్యటన ఆద్యంతం రైతులకు ఉత్తమాటలు చెప్పి జనాలను మభ్యపెట్టి వెనుతిరిగి వెళ్లారని అన్నారు. రోడ్లపై ఉన్న వారిని తీసుకువచ్చి బంగారుపాలెంలో షో చేశారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వ్యభిచార గృహంపై అలిపిరి పోలీసులు గురువారం దాడి చేశారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి, సుజాతనగర్‌లో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకొని అసాంఘిక కార్యక్రమాల నిర్వహిస్తునట్లు తెలియడంతో దాడి నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఆర్గనైజర్ కుమార్‌తో పాటు ఓ విటుడు, బెంగళూరుకు చెందిన ఇరువురు మహిళలు, రాజమండ్రికి చెందిన ఓ మహిళ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ మహిళను అదుపులో తీసుకున్నారు. పట్టుబడిన కుమార్ ఇంతకుమునుపే ఇలాంటి కేసులోనే అరెస్టు అయినా ఇదే వృత్తిగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):శేషాచలం అటవీ పరిధి, అన్నమయ్య జిల్లా, సానిపాయ రేంజి అటవీ ప్రాంతంలో నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని 22 ఎర్రచందనం దుంగలు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ మురళీధర రెడ్డి బృందం బుధవారం రాత్రి నుండి సానిపాయ పరిధిలోని వీరబల్లి మీదుగా గడికోట వైపు కూంబింగ్ చేపట్టారని తెలిపారు. గురువారం తెల్లవారుజామున న్యాయనూరు ప్రాంతం వద్ద మూడు మోటార్ సైకిళ్ళు ఉన్నాయని, వాటి సమీపంలోనే కొందరు వ్యక్తులు గుమికూడి ఉండడాన్ని గమనించి వారి వద్దకు వెళ్లి చుట్టుముట్టు చేసే ప్రయత్నం చేయగా వారు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. పారిపోతున్న వారిని వెంబడించి నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి సిఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హత్యాయత్నం కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి గురువారం రిమాండ్ నిమిత్తం శ్రీకాళహస్తి కోర్టుకు తరలించినట్టు టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీన పాత కక్షల నేపథ్యంలో వీఎంపల్లికి చెందిన కొందరు యువకులు మంచినీళ్లగుంటకు యువకులపై మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై మంచినీళ్ళ గుంటకు చెందిన ధనుష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఎంపల్లికి చెందిన భవానీ శంకర్ (22), కయ్యూరి సాయి కిరణ్ (24), చింతపూడి లీలా సాగర్ (21), నక్క వాసు (25), చింతపూడి కళ్యాణ్ (23), కూలీ మునిరాజా (20) లతో పాటు మైనర్ బాలుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వీరిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం గుర్తించి వారి వద్ద నుండి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవాచారి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపర్ ఇంటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి ఆదేశాలతో తిరుపతి నగరంలోని పెద్దకాపు వీధిలో తదితర ప్రాంతాలలో నిఘా ఉంచామన్నారు. పెద్దకాపు వీధిలో నివాసం ఉంటున్న ప్రకాశం జిల్లాకు చెందిన భువనేష్, ప్రశాంత్ అనే యువకులు గంజాయిని సరఫరా చేయడం, విక్రయించడం చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. దీనిపై తిరుపతి అర్బన్ ఎక్సైజ్ స్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై స్వామినాథన్, కానిస్టేబుళ్ల మునిరెడ్డి, డేవిడ్, చిరంజీవి, హరి ప్రసాద్, నిర్విఠారిక, మెహతాజ్, రూప కుమార్ పాల్గొన్నారు.

వీఆర్ఓను మోసం చేసిన వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలంలోని విజిలెన్స్ డిపార్ట్మెంట్ అధికారులమని మోసాలకు పాల్పడుతున్న ముఠాను గురువారం గాజుల మన్యం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 1,26,000 నగదు, 5 సెల్ ఫోన్‌లు, ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. వీళ్ళ టార్గెట్ అంతా రెవిన్యూ స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల లక్ష్యంగా ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. వడమాల పేట ఎం ఎస్ వి పురానికి చెందిన వీఆర్వో భూపతిని మోసం చేయడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారన్నారు. దీంతో పోలీసులు కాపు కాచి గురువారం నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారని రూరల్ సీఐ మురళి, ఎస్ఐ సుధాకర్‌లు తెలిపారు.

వీధి వ్యాపారులకు అండ ఎర్రజెండా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వీధి వ్యాపారులకు సిపిఐ ఎర్రజెండా అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాద్ రెడ్డి తెలిపారు. సిపిఐ వీధి వ్యాపారుల సంఘం శాఖ మహాసభలు కె.ముని బాలాజీ, సంజీవయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ శాఖ మహాసభల్లో సిపిఐ నగర కార్యదర్శి జెల్లా విశ్వనాథ్ పాల్గొన్నారు. హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో 6000 మందికి పైగా వీధి వ్యాపారులు ఉన్నారని, వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీది వ్యాపారుల వద్దకు వచ్చి వివరాలను సమీకరించి సర్వే నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమా ర్, నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివా సులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ వేస్టును నిర్మూలిస్తాం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: డంపింగ్ యార్డ్ వేస్టును బయో మైనింగ్ ద్వారా నిర్మూలిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం రాత్రి సూళ్లూరు పేట పుర పాలక సంఘ పరిధి, జాతీయ రహదారి సమీపంలో గల డం పింగ్ యార్డ్‌ను పరిశీలించారు. డంప్‌యార్డ్ పట్టణానికి మచ్చులా మారిందన్నారు. 25 సంవత్సరాలుగా చెత్త వేస్తుండ టంతో, ఇప్పుడు ఇబ్బందికరంగా మారిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా (ఎంటైర్ లెగసీ డంపింగ్ బయో మైనింగ్ పద్ధతిలో చెత్తను సేకరించి చిన్న పార్టికల్స్ గా చేసి, దాన్ని తిరిగి ఎరువుగా మార్చే ప్రక్రియను బయో మైనింగ్ అంటారు) శుభ్రం చేసి ఈ పెద్ద సమస్యను తీర్చనున్నట్లు తెలిపారు.ఇక్కడ సుమారుగా 40,000 పై చిలుకు టన్నుల లెగసీ డంప్ వేస్ట్ ఉంది. ఈ 40,000 టన్నులని కూడా రోజుకి 850 నుంచి 1,000టన్నులు చొప్పున చేస్తూ, ఆగస్ట్ చివరినాటి కల్లా పూర్తిగా ఈ డంప్ సైట్ ను మొత్తం కూడా తొలగిస్తామన్నారు. రోజు వారి వచ్చే 20, 25 టన్నులు సూళ్లూరుపేట మున్సిపాలిటీ నుంచి వస్తుందని,. దానికోసం ఊరికి సుమారుగా 7, 8 కిలోమీటర్ల దూరంలో ఆల్టర్నేట్ సైట్ కూడా గుర్తించామన్నారు. ఆల్టర్నేట్ సైట్ లో కూడా వచ్చే 10 రోజుల తరువాత నుంచి అక్కడ డంప్ చేసుకోవడం మొదలు పెడతామన్నారు. మొత్తానికి వచ్చేఆగస్టు నెల చివరి కల్లా ఈ డంప్ మొత్తం క్లియర్ అయిపోయి, సూళ్లూరుపేట టౌన్ కు ఈ డంప్ నుంచి పూర్తిగా విముక్తి కలుగుతుందన్నారు.ఇక్కడ మంచి పార్క్ కూడా ఏర్పాటు చేయమని మున్సిపల్ కమిషనర్ కి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. డంప్ తొలగించి కాలంగి రివర్ ని కూడా రక్షించుకునే పరిస్థితి. ఏర్పడుతుందన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ లెగసీ వేస్ట్ నిర్వహణ పనులు పురోగతిని జిల్లా కలెక్టర్ వారికి స్వయంగా నివేదించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, CHETIPATTU RAMADEVI (Old name), D/o CHETIPATTU VENKATAIAH w/o S VINAY Resident of 1/70, Kambakam (HW), Kambakam Village of Varadaiahpalem Mandal of Tirupati district (Chittoor district), Andhra pradesh- 517541, India. Hence I have changed my name to CHETIPATTU RAMMDEVI (New name). Here after my name is known as CHETIPATTU RAMMDEVI. **Place:-** Varadaiahpalem.
From :- Chetipattu Ramadevi
Date:- 10.07.2025

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) SRIKALAHASTI
I. P. No: 6 /2021
P. Arun Kumar & P. Chiranjeevi
...**PETITIONERS (Debtors)**
AND
P. Venkatarathnam & others
...**RESPONDENTS (Creditors)**
Notice to Respondents No: 30, 44 & 51
30. R. ANURADHA, W/o R. Gopal, D.No: 5-27, Kalki Lab, M.G. Street, SRIKALAHASTHI, Tirupati District.
44. D. SUDHAKAR, S/o D. Sriramulu, D.No: 16-956. Panagal, SRIKALAHASTHI, Tirupati District,
51. NARJALA SOMASEKHAR, S/o Radha Krishnaiah, D.No: 11-283, Bahadurpet, SRIKALAHASTHI, Tirupati District
Please take notice that the above petitioners filed above I.P and the above said petition is posted to: 24-07-2025 for your appearance either in person or through your advocate at about 10-30 A.M. in the above court. In the event of your absence, the matter will be decided Experte
Sri K.V. RAMANA RAO,
Smt. D. UMA,
Sri P. PARDHASARADHI,
Advocates for petitioners
SRIKALAHASTHI